# అడవిలో అన్నలు

రాత్రి... అది అడవిలోని రాత్రి... అది వెన్నెల గుంకిన రాత్రి. అది నిశ్శబ్దంగా వుంది. అది నిశ్చలంగా వుంది... అది నిశ్చల నిశ్శబ్దం యింకా అలుముకుంటున్న చీకటి రాత్రి. అది అడవిలోని చీకటి రాత్రి... అది అడవిలోని చలికాలపు చీకటి రాత్రి.

అది చలి. ఆ అడవిలోని చలి. ఆ అడవంతటా చలి. ఆ అడవిలో నిశ్శబ్దం. ఆ అడవిలో నిశ్చలనం. అ అడవిలో చీకటి. ఆ అడవిలోని చలికాపు నిశ్శబ్ద, నిశ్చల చీకటి రాత్రి అది. అది కురుస్తున్న మంచు. అది రివ్వున వీస్తున్న చలిగాలి. అది మంచులో ముంచితీసి రివ్వున వీస్తోన్న చలిగాలి.

అవి ఎండుటాకులు. అవి మంచులో తడుస్తూ మెత్తగా, మత్తుగా జోగుతున్న ఎండుటాకులు. మంచు యింకా యింకా కురుస్తూనే వుంది. రివ్వున చలిగాలి యింకా యింకా వీస్తూనే వుంది. కురుస్తోన్న మంచు, వీస్తోన్న గాలి. అది అడవిలోని చలికాలపు నిశ్శబ్ద నిశ్చల చీకటి రాత్రి. చలి గడ్డ కడుతున్న రాత్రి.

గడ్డ కడుతున్న ...ఆ చలిలో....ఆ అడవిలో.....ఆ నిశ్చలంలో....ఆ నిశ్శబ్దంలో... ఆ చీకటి రాత్రిలో..... చలికి గిట్టకరుచుకున్న పళ్ళు వణుకుతున్న నవ్వడి వినిపిస్తోంది. వణుకుతున్న దవడలు మరింత కొట్టుకుంటున్న సవ్వడి యింకా యింకా వినిపిస్తూనేవుంది. ఆ చేతిలోని రైఫిల్ నిశ్శబ్దంగా చలిచలిగా వణుకుతూనే వుంది.

ఆ చేతిలోని రైఫిల్ ....ఆ వణుకుతున్న దవడలు... ఆ నిశ్చల అడవిని...అ చీకటి చలిరాత్రిని పహరా కాస్తోంది....ఆ పహరాలో అడవిలోని దళం నిశ్శబ్దంగా నిద్రిస్తూంది. నిద్రిస్తున్న ఆ దళానికి ఆ రైఫిల్ సెంట్రీ చేస్తూంది. అది సెంట్రీ డ్యూటి. అతని పేరు సుధాకర్.

సుధాకర్ సెంట్రీ డ్యూటి చేస్తున్నాడు...కాలేజి చదివే సుధాకర్ అడవిలోకొచ్చి అపుడే అయిదు నెలలు గడిచిపోయాయికూడా. అయినా ఇంకా అడవికి పాతబడినట్టులేదు. అందుకే ఈ అయిదు నెలల్నించి ప్రతిదీ ఇంకా కొత్త అనుభవమే. అదేమిటోగాని అతని అనుభవాలన్నీ కొత్తవే. ఈ అయిదు నెలల్లో రెండు నెలలు చలి, మూడు నెలలు ఎండకాలంతోను గడిచాయి. అడవి, అడవిలోని అందాన్ని ఇంకా చూడ వలసివుంది. ఆకురాలు కాలంకూడా ఇంకా చూడాల్సేవుంది. మళ్ళీ మారాకు వేసి వచ్చగా వికసించే అడవిలోని వసంతాన్ని ఇంకా చూడాల్సేవుంది. తునికాకు కొమ్మ నరికేకాలం త్వరలో రాబోతోంది. ఇక త్వరలోనే కొత్తాకులు మారాకులేసే తునికాకు సీజను త్వరలో రాబోతోంది. కొమ్మలు రెమ్మలు నరకందే కొత్త ఆకు రాదు.

ఔను తునికిచెట్లు వుండాల్సిందే. తునికి ఆకు తెంపాల్సిందే. అది మంచి ఆకులు ఇవ్వాలంటే దాని కొమ్మలు రెమ్మలు నరకాల్సిందే.

ఆ అడవిలోని గిరిజనులు ఆ ఆకు తెంపాల్సిందే. దాంతో వారి జీవితం మారాకు తొడగాలంటే కాంట్రాక్టర్ లాభాల కొమ్మలు వంచాల్సిందే. ఇప్పుడదే పనిమీద ఈ దళం గిరిజన గ్రామాల్లో కాంపెయిన్ చేస్తూవుంది.

ఈ దళ జీవితంలో ఇన్ని కష్టాలుంటాయని సుధాకర్‌కి తొలుత తెలియదు. ఏవో కష్టాలుంటాయనుకున్నాడేగానీ యిలాంటి కష్టాలని ఊహకైనా అందలేదు. ఈ కష్టాలు ఊహకందేది ఈ జీవితం తెలిస్తేనేకదా!

ఆరోజు అన్న ఆ రాత్రంతా మాట్లాడ్తూనే వున్నాడు. చివరగా సుధాకర్ అతని నిర్ణయం ఏం చేశావని అడిగాడు. నిజమే... నిర్బంధం ముందుకొస్తుంది. ఇక బహిరంగంగా అవకాశాలుండవు. జైలుకి రెడి అవడమో, అన్న చెప్పినట్లు అడవిలో గిరిజనుల్ని చైతన్య వంతుల్ని చేయడానికి రహస్య జీవితానికి రెడీ అవడమో రెంటిలో ఏదో ఒకటి ఎంచుకోవాల్సిన అవసరం రోజురోజుకు ముంచుకొస్తూంది.

మధ్యే మార్గంగా రాజకీయాల్నే వదులుకుని ఎక్కడో ఏదో రకంగా బ్రతుకు బతికే అవకాశంకూడా వుండింది. ఆ మార్గాన్ని ఆ అన్న గుర్తుచేయలేదు. సుధాకర్‌మీద ఆ అన్నకి అంత గురి మరి! కానీ...సుధాకర్‌కి ఆ మధ్యే మార్గం వుందని కూడా తెలుసు.

సుధాకర్ అంత పిరికివాడు కాదు. అతను ధైర్యశాలి. అతను మహామనోబలసంపన్నుడు. ఆ మనోబలమే...గడ్డ కడుతున్న....ఆ చలిలో ....ఆ అడవిలో... ఆ నిశ్చలనంలో...ఆ నిశ్శబ్దంలో...ఆ చీకటి రాత్రిలో... చైతన్యంగా సెంట్రీ చేస్తోంది.

చలి... చలి... చలి... రివ్వున వీస్తున్న చలి... ఒళ్ళంతా కొరుకుతున్న చలి... జివ్వున చర్మం ముడుచుకొంటున్న చలి... ఆ చలిలో వెనకనుండి అలికిడి వినిపించి నిద్రిస్తున్న దళం వంక చూశాడు సుధాకర్.

దళ కమాండర్ రాజన్నకు మెలుకువ వచ్చినట్టుంది. గుబురు మీసాల్తో గంభీరంగా వుండే రాజన్న నిద్రలేస్తూనే టైం అడిగాడు.

"అయిదు"

సుధాకర్ నోరు తెరవడంతోనే దవడలు టకటక కొట్టుకున్నాయి.

ఆ పాటికే ఆలస్యం అయిందని అందర్ని నిద్ర లేపాడు రాజన్న. తన వద్దమన్న వాచీని డ్యూటీ మారినట్టుగా రాజన్న కిచ్చాడు సుధాకర్. దళ సభ్యులందరితోపాటు కిట్ వేసుకొని రెడీ అయ్యాడు సుధాకర్.

చలి యింకా గడ్డ కడుతూనే వుంది...మంచు యింకా కురుస్తూనే వుంది...చీకటింకా కొనసాగుతూనే వుంది...ఆ చలిలో చీకటిలో చలికి వణకుతూనే ఆ దళం బయల్దేరింది.

దళం నడుస్తోంది.

దళం నిశ్శబ్దంలో శబ్దంలా నడుస్తూనే వుంది.

ఆ శబ్దం అడవి చెవిలో ప్రతిధ్వనిస్తూనే వుంది.

అడవి అప్పుడే మత్తుగా మబ్బుగా నిద్ర మేల్కొని ఒళ్ళు విరుచుకొంటోంది.

నడుస్తున్న పిల్లతోవకి ఎడం వేపున తునికి చెట్టు చాటున కొండగొర్రె ఒళ్ళు విరుచుకొంటోంది. అల్లంత దూరాన విప్ప చెట్టుకింద ఎలుగుబంటు విప్ప పువ్వు ఏరుకొని తింటూ మధ్య మధ్య అరుస్తోంది. వెదురు బొంగు పొదల అవతల నెమళ్ళు రెక్కలు చప్పుడు చేస్తూ అరుస్తున్నాయి.

దళం నిశ్శబ్దంలో శబ్దంలా అలా నడుస్తూనే వుంది.

అడవి కోడిపుంజు రెప రెప కొట్టుకుంటూ వాళ్ళమీదుగా ఎగిరిపోయింది. దళం యింకా నడుస్తూనే వుంది. పొగచూరి అడ్డంగా వేలాడుతున్న మంచు మబ్బుల్ని తొలుచుకుంటూ పొద్దు నిదానంగా పైకి లేస్తొంది.

ఎక్కడ నుండో నిశ్శబ్దంలో శబ్దంలా పిల్లలు, మేకల కలకలం ఉండి ఉండి వినిపిస్తోంది.

ఈ కలకలమే బాటగా ఆ నిశ్శబ్దంలో శబ్దంగా నడుస్తున్నది, దళం.

దళం ఊరికి దగ్గరవుతోంది.

గుడిసెలోంచి కమ్ముకున్న పొగ మంచుతో కలిసి మంచు పొగ చూరి పొగ మంచై నీలి నీలి గోడకడ్తుంది.

ఉదయం ఏడు కావొస్తోంది.

దళం చిన్న మాలిని అనే గిరిజన ఊరు అంచుకు చేరుకొంది. ఊరు అంచుకు అరమైలు దూరాన ఆ దళం ఆగింది.

కమాండర్ రాజన్న దళంలోంచి సుధాకర్‌నీ, వెంకన్ననీ ఊళ్ళోని పరిస్థితిని తెలుసుకు రమ్మని పంపించాడు.

దళం వాళ్ళ రాక కోసం ఎదురుచూస్తూ అక్కడే నిలబడిపోయి లేతఎండకి చలి కాగుతున్నది.

ఊళ్ళో పిల్లలు వీధి మధ్యలో నెగడు రాజేసి చలి కాచుకుంటున్నారు.

ముఖ్యులను కలసి పరిస్థితి తెలుసుకొని వెనుదిరిగారు సుధాకర్, వెంకన్న.

వాళ్ళు దళం చేరగానే దళం వూళ్ళోకి బయల్దేరింది. వెంకన్న మాత్రం సెంట్రీగా వూరి అంచునే ఉండిపోయాడు.

దళం వూళ్ళోకి వచ్చింది.

"రాం రాం దాదా ! (దండాలన్నా)"

"రాం రాం దాదా"

గిరిజనుల పలకరింపు మధ్య దళం వూళ్ళోకి చేరింది.

"సమ్‌దీర్ చోకొట్ మంతెర్ దాదా! (అందరు బాగున్నారా! అన్నా !) అని దళం అందర్ని పేరు పేరునా పలకరిస్తోంది. దళాన్ని చూడ్డంతోనే అందరూ వాళ్ళ చుట్టు మూగిపొయ్యారు.

"వుద్దాట్ దాదా ! వూద్దాట్ ! (కుర్చోండన్నా కూర్చోండి)"

నిలబడ్డ వాళ్ళని ఉద్దేశించి అన్నాడు అనునయంగా రాజన్న.

అందరు చలి చలిగా కూర్చున్నారు. దగ్గర దగ్గరగా ఒకరినొకరు రాసుకొని కూర్చున్నారు. దళం గళం విప్పింది, పాటకూడా చలిగా వుంది.

సుధాకర్ గోండు బాషని అప్పటికే కొంత కొంత నేర్చేసుకున్నాడు.

"కొంగు నడిదోహవె సెల్లాదు, సట్టెడ్ కదిపియవె సెల్లాదు."

"(కొంగు నడుముకు చుట్టవె చెల్లెమ్మ)" అంటూ దళంతో గళం కలిపాదు సుధాకర్. పల్లవి పూర్తి కావడంతో పాటలోని చలి ఎగిరి పోయింది. పాట పూర్తయ్యేసరికి అందరు నిశ్శబ్దం.

ఆ చలిలోనూ వేడెక్కిపోయిన వాతావరణం. అది అడివిలోని నిశ్శబ్దంలా నిశ్శబ్దంగా వుంది. అందరు అనునయంగా మాట్లాడే కమాండర్ రాజన్నకేసి ఆసక్తిగా చూస్తున్నారు.

తునికాకు కూలీల గురించి వివర్తిస్తూన్నాడు రాజన్న.

రాజన్న కంఠం కంచులా మ్రోగుతోంది.

"నిరుటి కన్నా ఈ ఏదు పోలీసు బందోబస్తు ఎంతో పెంచుతున్నారు. అయినా మనం నిరుటోలె ఒక్కటిగ నిలవడాలె. ఈ చెట్టు ఆ చెట్టు నుండి తెంపిన ఆకులను ఒక్క దగ్గరకు కుప్పవోసి ఎట్లా కట్టాకదుతామో గట్ల ! గట్ల మన యూనిట్‌లోని గూడాలన్ని ఒక కట్టు మీదుండాలె."

అందరు ఆలోచనల్లో పడ్డారు. ఆ ఆలోచనల వేడికి చలి ఎగిరిపోతున్నది. ఖాకీలై తేనేం కాలు జాడించి తంతాం, అని నిరుడు నిలబడితే ఈ ఏదు నిరుటి కన్నా కూలి తగ్గించి ఖాకీల్ని పెంచే ఖర్చు పెంచుకొంటున్నది సర్కారు.

పటేల్ సుక్రు-ముసలి సుక్రు లేచి అదే అడిగాడు. ఒంటినిండా బట్టలు లేని సుక్రు పటేలు చలికి వణుకుతునే అడిగాడు.

సుధాకర్ ఒక్కొక్కటి గమనిస్తున్నాడు.

అతను వాళ్ళందరినీ పరిశీలిస్తున్నాడు.

ముసలి తాత పటేల్ సుక్రు అడుగుతున్న తీరు చూస్తుంటే ఎందుకో చటుక్కున అతనికి తాను చేసిన విలేజి క్యాంపెయిన్ గుర్తొచ్చింది.

ఓ రోజు...ఆ పల్లెలో...ఆ ముసలి తాత... ముడతలు తేలిన చర్మం..లోతుకు పోయిన కళ్ళు...తెల్ల బడిన తల...వంగిపోయిన వెన్ను... కర్ర పొడుచుకుంటూ నడిచి వచ్చి... అంత పెద్ద మీటింగ్‌లోఅలా అందరి ఎదుటే.... ఆ చూపు ఆనని కళ్ళు చికిలించి చూస్తూ యిలాగే... అచ్చం యిలాగే నిలబడి మీసాలైనా వచ్చాయా అని చూస్తూ,

"మీరేం జేస్తరు ? ఇట్ల పాటలు పాడి పోతరు. ఆటెన్క తన్నులు మాకే గద! మీరు ఆరుస్తరా ! తీరుస్తరా ! మూతి మీసాలన్నా రాలేదు....మీరేం జెస్తరు తియి...

ఆ తాత కళ్ళు ఎంత వాడి... ఆ తాత ముహం ఎంత వేడి... ఆ తాత ముహం నిన్ననే చూసినంత స్పష్టంగా గుర్తుంది...అప్పుడే... ఔను ! అప్పుడే క్యాంపెయిన్ దళ సభ్యుడైన తాను అప్పుడే ప్రతిజ్ఞ చేసాదు.

"మీరు పోరాటం జెయ్యిన్రి. మీరు కదులుతే మీ కోసం మేం ప్రాణాలిచ్చుటానికే తయారున్నం... మమ్ము సంపుకున్న మీరే...మమ్ము సాదుకున్న మీరే..."

ఆ మాటతో ఆ పాటతో ఆ తాత ఆనంద బాష్పాలతో ఆ స్టేజీ మీదే అందరి ఎదుటే తనని కౌగలించుకొని ఊపి ఊపి.... ఆనక ఏడ్చి ఏడ్చి...అలా ఆ తాత దీనంగా...తీక్షణంగా తనలోకి చూస్తూ... కరుడు గట్టిన గతమంతా కదిలి కరిగి కన్నీరై ప్రవహించాదు. తన వొళ్ళంతా పుణికి తడిమి మళ్ళీ హత్తుకున్నాడు. తాత అలా తీర్చిదిద్దాడు తనని. ఆ సంఘటన

తన జీవితంలో ఎంత మధురమైన జ్ఞాపకం ! చెమట కంపు, చుట్ట కంపు, ముసలి కంపు కొడుతున్న ఆ తాత కౌగిలి ఎంత మధురమైన జ్ఞాపకం!...

అవి తాను విద్యార్థిగా క్యాంపెయిన్ చేసిన అవో రకం బాధలనుభవించిన మధుర స్మృతులు, అవి ప్రజలే తనని తీర్చిదిద్దిన మధురస్మృతులు. అప్పుడు ఆ రోజుల్లో ప్రచారం....ఆందోళన...ప్రజాందోళన...అది ఆనాటి తీరు...ఉద్యమం... నిర్మాణం... నడవడం...ముందుకు నడిపించటం...ఇదీ ఈ నాటి తీరు.

ఉద్యమం తన దశలని ఎంత త్వరగా మార్చుకుంటున్నది ! ఈ రోజు తాను, అలా మారుతూ మార్చుతున్న దాన్లో ఓ విడదీయరాని భాగం. ఈ భావం రాగానే మళ్ళీ నూతనంగా తనలో ఎంత తన్మయత్వం !

ఇది ఈనాటి జీవితం... అది ఆనాటి విద్యార్థి జీవితం...అది ఆనాటి తన రాజకీయ బాల్యం... బాల్య స్మృతులంటే ఎవరికైనా ఎందుకింత యిష్టమో !

కమాండర్ రాజన్న యింకా ఏదో చెప్పుతూనే ఉన్నాడు. అందరూ చలి మరిచిపోయి వింటూనే ఉన్నారు. పటేల్ సుక్రు – సుధాకర్ చేయిపట్టి కుదపడంతో ఉలికిపాటుతో మళ్ళీ వర్తమానంలోకి వచ్చాడు. సుక్రు తాత మళ్ళీ అడిగాడు.

"దాదా లీరు ఘటో తీత్తోరు సిల్లె........."

(అన్నలు ! అన్నం తింటారా ! లేదా !)

తమ తిండి బాధ్యత మీదేసుకున్న సుక్రు ఆ ఏర్పాట్లు చేయాలా వద్దా అని అడిగాడు.

"తింటం తింటం" అంటూ తల ఆడించారు సుధాకర్ సుక్రు ఆ ఏర్పాట్ల కోసం ఎవరో యిద్దర్ని పురమాయించి వాళ్ళ వెంటే కదిలాడు.

అంతదాకా కనిపించని ఆకలి అపుడే వెతికితే దొరకినట్టు గుర్తొచ్చింది సుధాకర్‌కి. అంతదాకా తగలని చలి అప్పుడే తగిలినట్టుగా వుంది సుధాకర్‌కి.

సుక్రు, మరో యిద్దరు గంప తీసుకొని యింటింటా అన్నం జమ చేయడానికి వెళ్ళారు. గిరిజనులు కొందరు అన్నం వేయడానికి లేచి వెళ్ళారు వాళ్లు అన్నల మాటల్నే మళ్ళీ మళ్ళీ ఆలోచిస్తున్నారు.

ఎవరో ఓ కుండలో నీళ్లు తెచ్చారు. ఆ నీళ్ళు కూడా మంచులా చల్లగా వున్నాయి.

అక్కడ వాళ్లు కడుపునిండా అన్నం పెట్టగలరే కాని కాళ్ళు కడుక్కొనడానికైనా నీళ్ళివ్వలేరు. అంత కరువు ఆ అడవిలో నీళ్ళు. అంత దూరం వాళ్ళ వూరి నీళ్ళు.

ఆ కుండ నీళ్ళతో పదిమంది మొహాలు కడుక్కున్నా యింకా సగం నీళ్ళు మిగిలే వున్నాయి. అలా అందరూ మొహాలు తడుపుకున్నారు.

తొందరగా తన భోజనం ముగించి వెంకన్నని సెంట్రీ డ్యూటి నుండి రిలీవుచేసి పంపాడు భీమన్న.

వేడి వేడి అన్నం తినడంతో చలిపులి బెదిరిపోయింది.

దళం మరో వూరు బయల్దేరడానికి తయారైంది.

యింకా ఏమైనా చెస్తారని, మరి కొన్ని పాటలు పాడుతారని కొందరు యింకా, దళాన్ని ఆశగా, ఆసక్తిగా చూస్తున్నారు.

"ధంతుం దాదా ! ధంతుం (పోతం అన్నా పోతం) మల్లి వచ్చినప్పుడు సాన సేపుంటం

సాన పాటలు పాడుతాం. ఇప్పుడు అన్ని వూళ్ళు జెల్డి జెల్డి తిరుగాలెగద. ధంతుం దాదా ! రాం రాం దాదా" అంటూ దళం సెలవు తీసుకుంది.

దళం నడుస్తోంది.

చలికాలపు ఎండ...దళం అలా ఒక వూరి నుండి మరో వూరికి పాద యాత్ర సాగిస్తూనే వుంది. సుధాకర్‌కి ఎందుకో ఆకస్మాత్తుగా వనవాసంచేసే పాండవులు గుర్తొచ్చారు

ఔను. తాము పాండవులమే. మోసంతో కపటంతో రాజ్యాధికారం కోల్పోయిన పాండవులమే. తమ నెత్తురు తమ చెమటపై అధికారం కోల్పోయిన పాండవులం తాము. తాము పాండవులమైతే తాను ? అర్జునుడు ! ఉహూ! గురి చూస్తే గురివింద గింజనైనా తప్పించు కోకుండా కొట్టగలవాడు నిజంగా అర్జునుడు భీమన్న.

మరి తాను ! ధర్మరాజు ! ఉహూ! సత్తెకాలపు రైతు బైతు వెంకన్నే ధర్మరాజు. మరి తాను నకులుడు. సహ దేవుడు. ఔను తాను సహదేవుడే. సహ దేవుడు ఎంత గొప్పవాడు ! ఛ.........ఎవడూ సహ దేవున్ని గొప్పగా రాయరేంటి ? ఛ ! ఎవడూ సహ దేవున్ని హీరో చేసి సిన్మా తీయలేదేంటి. తన ఆలోచనలకి తనే నవ్వుకున్నాడు సుధాకర్.

కరుణగల కమాండర్ రాజన్న కళ్ళతోనే అడిగాడు "ఏందో నీలో నువ్వే నవ్వుకుంటున్నావు ? మాక్కూడ ఆ ముచ్చటేదో చెప్పరాదు !"

సుధాకర్ తన కొచ్చిన ఆలోచన చెప్పాడు. అందరూ ఉత్సాహంగా నవ్వుకున్నారు.

చలిగాలి యింకా తగ్గలేదు. ఎండ, చలి...చలిలో ఎండ...ఎండలో చలి.. నవ్వి నవ్వి చలికి పగిలిన పెదవి చిట్లి నెత్తురు చార కట్టింది. నవ్వులు కాస్త సద్దుమణిగాయి. దేన్నైనా పిండి, రాజకియ తేనె తీసి తా...చి పిప్పిని మైనం ముద్ద చేయగలడు రాజన్న. ఆ తేనె పట్టులో తేనె పట్టుకొన్నాడు రాజన్న.

"అయితే వాళ్ళు జూదం ఆడి వోడిపోయిన్రు. మనం నెత్తురొడిసి కష్టపడి గూడ వోడిపోయినోల్లం. వాళ్ళవాళ్ళ సుఖాలకోసం రాజ్యం గెలుచుకున్నారు. అధికారంలోకి వాళ్ళచ్చినా ప్రజలకు చేసిందేం లేదు. ధర్మరాజు పరిపాలన ఎంత గొప్పదంటే రోజుకు పదివేల మందికి సంతర్పణ పెట్టుండెనటు."

"అబ్బా !" అని ఆశ్చర్యపోయాడు గోవు వంటి వెంకన్న.

"ఇంత ఎండల యింకా సలివెడుతున్నాదె" భాస్కర్ పరిహాసం చేశాడు.

"హూ! శివా శివా ! అని అన్నడట కృష్ణుని నోట యిది విన్న బలి చక్రవర్తి" మళ్ళీ అన్నాడు రాజన్న.

"అదె" అంటూ ఆశ్చర్యపోయాడు అర్థంకాని భీమన్న.

"నువ్వు జెప్పు" అన్నాడు రాజన్న సుధాకర్ కేసి చూసి.

"పదివేల మంది సంతర్పణ కాడికి ఆకలి ఆకలి అనుకుంటూ వచ్చే వూళ్ళో ఎంతమంది ఆకలికి మాడుతున్నారో గదా...! ఆ రాజ్యం పాలించే రాజు ఎంత పాపిష్టి దుష్టుడో గదా... ఆకలి తీరని రైతులున్నరంటే పన్నులు ఎంత వసూలు చేస్తున్నరోగదా ? అని అన్నడట కృష్ణుడితోటి బలిచక్రవర్తి. ధర్మరాజు తల తీసేసినట్టయిందట.... గది కథ" ఉత్సాహంగా చెప్పాడు సుధాకర్.

"అయితే గీ రెండ్రుపాయలక్కిలో బియ్యం పథకం గూడా గంతే నంటవ!" గోవువంటి వెంకన్న అడిగాడు.

"మరి అంతేగదనే పిల్లజెల్లల్తోటి ఏ యింట్లయిన పెండ్లాం మొగులు గలిసి నలుగురై దుగురైన వుండరా ?"

"ఉంటరు" భీమన్న.

మరి నెల కైదు వందలలోపు ఆదాయం వుంటేనేగద పచ్చకార్దిచ్చేది. మరియిప్పుడు మన ఆంధ్రప్రదేశ్‌ల తొంభై లక్షల పచ్చకార్డులున్నయని సర్కారే ధర్మరాజు తీర్గ ఘనంగ చెప్పుకుంటున్నది గదా !" అన్నాడు దేన్నైనా పిండి రాజకీయ తేనె తీయగల రాజన్న.

"హ ! శివశివా !" గోవులాంటి వెంకన్న మాటతో అందరు గొల్లున నవ్వారు. అదే దెబ్బతో చలి పూర్తిగా పారిపోయింది.

"ఇంకా మన గిరిజన గూడేలల్ల పచ్చకార్డు ముచ్చట్నే తెలవది..."

"తొంభై లక్షల కుటుంబాలు ఆంధ్రప్రదేశ్ల ఆకలి ఆకలి అని అన్నమో రామచంద్రా ! అని అల్లాడుతున్న యనటానికి యింతకన్నా నిదర్శనం ఏమిగావాలె?" సుధాకర్ మాటకి వెంకన్న ఔనని తలూపాడు.

దళం నడస్తూనే వుంది.

అది పచ్చని కొండ. అడ్డంగా నిట్టనిలువుగా వున్న కొండ. దళం ఆ కొండెక్కుతున్నది. రోడ్డంటూ ఉన్నది కాస్తా రిపేరు పడింది. వెదురు బొంగు కొండ నించి కిందికి తీసికెళ్ళే లారీలకోసం వేసిన రోడ్డది. ఆ బాటలో కాలినడక కష్టంగా వుంది. ఆ చెట్లల్లో దాక్కోవాలని చలికి చాలా యిష్టంగా వుంది. అంత చలి కాలంలోనూ అందరికి చెమటలు పట్టేశాయి. ఏ బాటలేని కొండపై వీలు చూసుకొని అడుగులు వేస్తున్నారు. అందరికీ చెమటలు కారుతున్నాయి.

సుధాకర్ దొర్లి పడబోయాడు. కిట్‌ని సర్దుకొని రైఫిల్ భుజం మార్చుకున్నాడు.

మరో నాలుగడుగులు వేశాడు. గులక రాళ్ళమీద పట్టు తప్పింది. ధభేల్మని బోరగిల పడిపోయాడు. చలికి పగిలిన పెదాలు మరింత పగిలిపోయాయి. మోకాలిచిప్ప కలుక్కుమంది. వెన్నులో ఏదో నరం పట్టుకుంది. పక్కనే నడుస్తున్న వాళ్ళది గమనించారు. అయినా వాళ్ళకది వినోదంలా వుంది. అందరూ నవ్వుతూ సుధాకర్ చుట్టూ మూగిపోయాడు.

ఆ కాస్తదెబ్బకి తన మొహం బాధతో ముడుచుకుపోయిందని వాళ్ళ నవ్వుకి అర్థం తెలిసిపోయింది. అడుగుతీసి అడుగు సరిగా వేయడమైనా యింకా నేర్చుకోలేదా అన్న వ్యంగ్యం ఆ నవ్వులో కనిపించి తన బాధ మరిచి సిగ్గుపడిపోయాడు. వెంకన్న చెయ్యందిస్తే ఉక్రోశంగా అందుకోకుండా లేచి నిలబడ్డాడు. అలాంటి అనుభవాలు ఎన్నో యింకెన్నో.

కొండ ఎక్కేసరికి ఆ చలిలో చెమటలు ధారలు కడుతున్నాయి. సుధాకర్ డ్రస్ అంతా తడిసి అంటుకుపోయింది. సుధాకర్‌కి ఆయాసంగా ఉంది.

"అన్నా ! గీడ కసేపు కూసుందమే"

కనికరిస్తాడేమోనని ఆశగా కమాండర్‌కేసి చూశాడు సుధాకర్... ఇక్కడెక్కడ కూసుంటవు? వూల్లెకు పోయినంక కూసుందంగాని నడు.... టైంలేదు."

ఆ మాటతో ఆ దళం మూగనోము పట్టినట్టుగా గబగబా మళ్ళీ నడక సాగిస్తూ.

దళం మానిగఢ్ చేరుకుంది. సుధాకర్‌కి దాహంగా వుంది. రెండ్రోజుల్నించి ఉపవాసం ఉన్నవాడిలా కడుపు డీలా పడిపోయింది.

ఊళ్ళోకి చేరడంతోనే "జర ఉనవ్ లెర్ సీం దాదా"

(కొన్ని మంచినీళ్ళియ్యన్నా!) అంటూ అలసటగా నిస్సత్తువగా కూలబడి పోయాడు సుధాకర్.

జనమంతా మూగి పోగై మీటింగ్ నడుస్తోంది.

"బోరుగిరి వాంతోర్ దాదా!" (ఎవరన్న వచ్చారన్న!)

రాజన్న వాకబు చేశాడు

"దాదా వాళ్ళొచ్చి పోయిన్రు"

"ఎవరు"

"వాళ్ళే"

రాజన్న మాట్లాడుతూనే ఉన్నాడు. మీటింగ్ నడుస్తూనే వుంది. సుధాకర్ అంత ఆలసటలోనూ అన్నీ గమనిస్తూనే ఉన్నాడు.

అలా సుధాకర్ దళ జీవితంలో మరో రెన్నెల్లు గడిచి పోయాయి. మరిన్ని అనుభవాలని తన సంపాదనగా వెనకేసుకున్నాడు సుధాకర్.

ఎండకాలం... ఏరుల్లోని నీళ్ళు సగానికొచ్చాయి. కొమ్మలు రెమ్మలు నరికిన తునికి చెట్లు లేలేత ఆకుల్తో పచ్చబారి వున్నాయి.

దళం విరామం లేకుండా గూడేగూడేనా తునికాకు తెంపే కూలి పెంచాలని పిలుపిస్తూ తిరుగుతూనేవుంది. కొమ్మకొట్టే కూలీ ఎంతకో అంతకు కుదిరింది కానీ ఆకు తెంపే కూలి ఏ నిర్ణయం కాలేదు. నిరుదు కట్టకి యిరవై తీసుకున్న ప్రజలు యిపుడు ప్రభుత్వం పదిపైసలే యిచ్చి బలవంతంగా ఆకు తెంపించాలనుకుంటే నిరాకరిస్తూనే వున్నారు.

దళం కోసం ఖాకులు గూడ గూడేన తిరుగుతూనే వున్నాయి. వందల ఖాకులు వేల ఖాకులు పెరుగుతూనే వున్నాయి. పల్లె పల్లెనా ఖాకుల క్యాంపులు వెలుస్తూనే వున్నాయి. గిరిజనులకి పెంచాల్సిన కూలీ ఈ క్యాంపు ఖాకుల వారం జీత భత్యం కన్నా తక్కువేనని దళం వివరిస్తూనే వుంది. అడవిలో కూడా పోలీసుల గుడారాలు లేస్తూనే వున్నాయి.

సమ్మె జరుగుతూనే వుంది. అరెస్టులు, చిత్రహింసలు, మానభంగాలు జరుగుతూనే వున్నాయి. బలవంతంగా కొన్ని గూడేల మీదపడి పోలీసులు ఆకులు తెంపిస్తూనే వున్నారు.

ఖాకులు దళాల కోసం వెతుకుతూనే వున్నాయి. ఖాకులు ఎదురుపడ్డప్పుడు వీలైనంతవరకు తప్పు కోవడమూ, విధిలేనప్పుడు ఎదురెదురుగా కాల్చుకోవడమూ జరుగుతూనే వుంది. ఖాకులు దళాల కోసం గూడేలన్నీ వెతుకుతూనే వున్నాయి. అయినా దళం గూడాలన్నిటా ప్రజల్ని అంటిపెట్టుకొని తిరుగుతూనే వుంది. గూడేలన్నింటిని కూడగడ్తూనే వుంది. దెబ్బ తిన్నవారికి ధైర్యం చెపుతూనే వుంది. దళం అలా నిరంతరం కదులుతూనే వుంది.

అక్కడక్కడ ప్రజలు శత్రువుల్ని అటకాయించి ఘెరావ్ చేస్తూనే వున్నారు. నిర్బంధానికి గిరిజనులు ఎదురు తిరుగుతూనే వున్నారు. వీలు చూసుకొని దళం, గిరిజనులూ కలిసి ఒకటి రెండు కల్లాలు కాల బెడ్తూనే వున్నారు. కట్టకు తగిన రేటు ఇవ్వకుండా బలవంతంగా ఆకు తెంపిస్తూనే వున్నారు.

ఇరు పక్షాలకి సంకుల సమరం జరుగుతూనే వుంది. ఒకరి మీద ఒకరు దెబ్బ తీస్తూనే వున్నారు. ఇంకా కొన్ని ఆకు కల్లాలు కాలబెట్టే ప్రయత్నాలు జరుగుతూనే వున్నాయి.

రేటు పెంచామని చెప్తూనే గిరిజనులతో ఆకులు తెంపించి కల్లాల దగ్గరకు తీసుకు వచ్చిన తరువాత పాత రేటుకే తీసుకోవడం జరుగుతూనే వుంది.

గిరిజనుల్లో అసంతృప్తి చెలరేగడం జరుగుతూనే వుంది. క్రితం రోజే మరో ఆకు కళ్ళం కాల్చేసిన దళం మరో  ఏరియాకు కదం తొక్కుతోంది. దళం నెత్తిమీద సూర్యుడు. వారిలోని ఆ వేడికి ఆ అడవి ఎక్కడ అంటుకుంటుందో !

అలా ఆ చైతన్యపు ఏరు పారుతూనే వుంది. ఏరు కిరుపక్కలా పచ్చని ఆకుల్తో చెట్లు ఒత్తుగా పెరుగుతున్నాయి. అందరికి ఎండ వేడిగా వుంది. వాళ్ళు స్నానం చేసి పదిహేను రోజులై పోయింది.   డ్రెస్‌లు ఉతకడం అంతకన్నా ఎక్కువ రోజులే అయింది. అవి చెమట ఉప్పుతో అట్టు చెక్కలే అయ్యాయి. అందుకే అందరు కలసి ఆ ఏరుకేసి వడివడిగా సాగుతున్నారు. ఏరు దగ్గరౌతున్న కొద్ది అలసట అనాల్సిన సుధాకర్ కాళ్ళు పరుగువేగమే అందుకున్నాయి. సుధాకర్‌కి అదోలా వుంది.

ఒళ్ళంతా ఉప్పు చెమటతో అట్ట కట్టుకుపోయింది. ఒళ్ళంతా బిగుసుకుపోయింది. వేసుకున్న డ్రస్సు చెట్టు బెరడు (తోడ్పు)లా అట్టగట్టి నడుస్తుంటే తన డ్రెస్ తనని ఎండిన కాగితప్పుల్లలా కోస్తోంది. అబ్బ! ఈ రోజు చిక్కింది. వీలు. కాదు కాదు ఈ రోజు వీలు చేసుకున్నారు వాళ్ళు. వడి వడిగా ముందు నడుస్తున్నాడు సుధాకర్.

" ఏయ్ సుధాకర్ ఆగు! మొర్రి పండ్లు తెంపుకుందాం" గురివిందకైనా గురి చూసి కొట్టే భీమన్న పిలవడంతో ఆగిపోయాడు సుధాకర్.

దళంలోని సభ్యులు నాలుగైదు చెట్లకి ఎగబడ్డారు. సుధాకర్ మొర్రిపళ్ళు తెంపుతున్నాడు.

"ఆగో మంచి గొల. ఇగో ఇక్కడ యింకా మంచి గొల" అంటూ భీమ్మన్న చెట్టంతా తెంపించాడు.

అవన్ని మూటగట్టి నిలబడ్డాడు సుధాకర్. రెండు మూడు పళ్లు మాత్రం నోట్లో వేసుకున్నాడు.

"మొన్న దిన్నయి మంచిగ లేవు. ఇవి చాల మంచిగున్నై."

"అయితే యింకేంది మూటిప్పు"

"ఉహుఁ" అంటూ సుధాకర్ తల అడ్డంగా తిప్పాడు. ముందు ఏరు చేరాలి. స్నానమాడాలి. స్నాన మాడాలని ఆరాటం.

"అరెరె నీళ్ళు కనవడుదు ఎంత పాపమైంది. ఇట్లంటే ఇంకో వారం ఆగి వస్తుంటిమిగద" రాజన్న సుధాకర్ తొందర చూసి మరింత ఉడికించాడు.

తెంపిన పళ్ళల్లో సగం తిన్నాక మిగిలిన సగం నడుస్తూ నడుస్తూ తింటు తింటూ ఏరుకేసి సాగింది దళం. ఆ ఏరు వాటర్ ఫాల్ చప్పుడు సంగీతంలా హృద్యంగా వినిపిస్తోంది.

ఆ అడవిలోని ప్రాంత జంతువులన్నిటికి ఆ ఏరు నీటి ఆధారం. అది ఎంత ఎండకాలమైనా పెద్ద కొండ మీంచి జలపాతమై ఎంతోకొంత పారుతుంది. ఆ వాటర్ ఫాల్ కింద పెద్ద కొలనులా తయారయ్యింది.

దళం అలికిడి విని నీళ్ళకోస మొచ్చిన నెమళ్ళు, కోతులు, కొండగొర్రెలు ఒక్కసారిగా ఎగిరి పారిపోయాయి.

కిట్లన్నీ ఒక్కచోట పెట్టి యూనిఫారాలు విప్పి అక్కడి చెట్ల నీడనుండి వచ్చే చల్లటి గాలికి కూర్చున్నారు కొందరు.

సుధాకర్‌కి ఆ వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. అన్ని నీళ్ళని చూసి ఎంతకాలమైందో, ఎన్నేళ్ళయిందో అన్నట్టు ఆబగా చూస్తున్నాడు. షర్ట్ విప్పాడు. వీపున చెమట అట్టకట్టి ఉప్పుతేలి ఇండియా మ్యాపులా మెరుస్తోంది.

"అహా! ఇగో ఇండియా మ్యాపు" అంటూ అందరికిచూపిస్తూ నీళ్ళల్లో తడిపాడు. ప్యాంటు కూడా తీసి నీళ్ళలో రెండు క్షణాలు మునిగి లేచి కూర్చున్నాడు.

"అబ్బహ్! ఎంత చల్లగున్నై నీళ్ళు! ఎన్ని రోజులైంది. తానంజెయ్యక.... అహ... అబ్బాహ్..." అంటూ అని మళ్ళీ నీళ్ళలో మునిగాడు.

అందరు తనువారా తానం జేసారు. డ్రెస్సులన్ని ఉతికి ఆరేశారు. అందరు రైఫిల్స్ ఆయిల్ వేస్తూ శుభ్రం చేస్తున్నారు. అందరికన్నా ఆఖరుగా నీళ్ళలోంచి అప్పుడే బయటకువచ్చాడు సుధాకర్.

అప్పటికి వాల్లు మిగిలిపోయిన మొర్రిపళ్ళు కానిస్తున్నారు. తిన్నాక ఆ గింజల్ని నీళ్ళల్లోకి విసురుతున్నారు. అందరు రైఫిల్స్‌కి ఆయిల్ వేస్తూ శుభ్రం చేస్తున్నారు. సుధాకర్ తన కోసం మిగిల్చిన మొర్రిపళ్ళు తింటూ ఉత్సహంగా పరధ్యానంగా రైఫిల్ బ్యారల్ విప్పుతున్నాడు.

వెంకన్నతో ఏదో ముచ్చటలోపడి నవ్వుతున్న భీమ్మన్న కంగారుగా సుధాకర్‌ని కేకేశాడు.

"ఏం! సుధాకర్! ఆ బ్యారల్‌ని భూమికి పెట్టి విప్పు! లేకపోతే మిస్ ఫైర్ అయితది"

సుధాకర్ తన ఉత్సాహంలోగల పరధ్యానాన్ని తానే తిట్టుకున్నాడు.

ఆ చల్లని స్నానం సంతోషంలో అది మరిచిపోయినందుకు నాలిక్కరుచుకున్నాడు.

రైఫిల్ శుభ్రం చేసుకున్న దళం కొంత విశ్రాంతి తీసుకుంది. చీకటి పడుతుండనగా మరో గూడానికి బయలుదేరింది.

అలా తనువారా స్నానం చేసిన సుధాకర్‌కి, దళం అందర్తో కేరింతాలు ఆడిన సుధాకర్‌కి తన చిన్ననాటి అమ్మమ్మగారి వూరి జ్ఞాపకాలు గుర్తొచ్చాయి. దళంతో నడుస్తూనే ఆలోచిస్తున్నాడు.

ఆ చిన్నతనంలో అచ్చం యిలాగే వాగులో ఎంతాట! ఎంత పాట! నిజంగా... బాల్యం ఎంత గొప్పది! ఆనాటి స్నేహితులంతా ఇప్పుడెలా వున్నారో!

ఊరు దగ్గరపడ్డంతో దళం ఆగిపోయింది. ఊళ్ళోకి భీమన్న, సత్తెన్న బయల్దేరారు.

ఉళ్ళోంచి డప్పుల చప్పుడు వినిపిస్తోంది.

ఏదో రాగం అలలు అలలుగా చెవిని సోకుతోంది.

సుధాకర్ ఆలోచనల్లో ఏదో మధురమైన పులకింత కలిగి వెంటనే ఆగిపోయింది.

ఆనాటి స్నేహితులంతా ఇప్పుడెలా వున్నారో! అందరూ పెళ్ళిళ్ళు చేసుకొని ఎవరి సంసారం వాళ్ళు చేసుకుపోతుండొచ్చు. తన మేనమామ కూతురు లలిత ఇప్పుడు ఏం చేస్తోందో! దానికి పుట్టగానే మొగుడని తనపేరే పెట్టారు.

అది ఎంత చలాకీగా వుండేది!

తన చెల్లెలితో అది కొట్లాడినా దానిదే పైచేయి. ప్చ్! తాను చదువుల వేటలో పడ్డాక దానికి పెద్దదైన మూదేళ్ళకే ముదిరిపోయిందని, యిక తనకిష్టం లేదని వాళ్ళే తీర్మానించుకొని తమ ఇంటికి రాకపోకలు మానేసి ఎవరికో ఇచ్చి పెళ్ళిచేసారు. ఇప్పుడు ఆ చలాకీతనమంతా ఏమైపోయిందో! ఇద్దరు పిల్లల తల్లయిపోయింది.

పిచ్చిపిల్ల... అప్పుడే ఎంత ముసలిదానిలా మాట్లాడుతోంది!

తనతో పెళ్ళయివుంటే దాని జీవితం ఏమైవుండేదో పాపం...

భీమన్న, సత్తెన్న రావడంతో దళం ఊళ్ళో డాన్సుచేస్తున్న బృందాన్ని చేరుకుంది.

ఊరు పూరంతా డాన్సు చేస్తూవుంది.

డప్పుల చప్పుళ్ళ మధ్య సెంట్రీ చేస్తున్నాడు గంగన్న.

దళాన్ని చూసి డాన్సు ఆపారు వాళ్ళు.

ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించారు.

"రాం రాం దాదా"

"రాం రాం దాదా"

"సమ్‌ధీర్ చోకోట్ మంతోర్"

"ఏంది దాదా విశేషం? అందరు డాన్సు చేస్తున్నారు" అర్థంకాని సుధాకర్ ఆసక్తిగా అడిగాడు.

"పెండ్లి దాదా పెండ్లి. అందుకే ఎగురుడు" అని అంటూ

"అరే దాదాలీరుకు కటుల్ సీమ్‌రే" (అరే అన్నలకు మంచం యియ్యరా) అని పురమామయించాడు గోండుదాదా.

ఎవరో మంచం తెచ్చి వేశారు ఎవరూ మంచంలో కూర్చోలేదు. దాని మీద ఇద్దరు కూర్చుంటేనే విరిగేట్టుంది.

అడవిలో వున్న పేరేగాని వాళ్ళకి అదికూడా కరువే.

కిట్టులన్ని మంచంమీద పెట్టి అందరు నిలబడ్డారు.

"దాదా... ఆడున్రి... మేంకూడా చూస్తం" కమాండర్ రాజన్న ప్రోత్సాహంగా అన్నాడు.

మళ్ళీ డాన్సు మొదలయింది.

కొద్దిసేపు తరువాత

"అరే దాదా... మీరుకూడా ఎగరాలె" అంటూ గోండుదాదా అందరిని లేవదీశాడు.

వెంకన్న, సత్తెన్న, భీమన్న, జగదీశ్, సుధాకర్, రాజన్న, లచ్చన్న గిరిజనుల్తోపాటు కలిసి చేతులు, నడుములు పట్టుకొని గోండు దాదాలతో అడుగు లేస్తున్నారు.

సుధాకర్ అడుగులు కొద్దిగా తడబడుతున్నాయి. అందరికన్నా బాగా ఆడే సుధాకర్ కొద్దిసేపటికే అడుగులు కలువక బయటకొచ్చాడు. సుధాకర్ ఆలోచనలు యింకా తెగినట్టులేవు.

కొద్దిసేపు డాన్సు ఆపారు గోండు దాదాలు.

కమాండర్ రాజన్న కంఠం సవరించుకున్నాడు.

ఎట్టి పరిస్థితిలో ఆకు తెంపేది లేదని అందరు నిర్ణయించుకున్నారు.

మీటింగ్ అయ్యాక పెళ్ళి హడావుడి మళ్ళీ మొదలయింది. పెండ్లి పిల్లలకు కట్నాలు ఇస్తున్నారు. అందరు అయిదు పైసలు పది పైసలు ఒకరిద్దరు పావులాలు ఇస్తున్నారు.

మొదటిసారి సుధాకర్ ఈ పద్ధతి చూసినప్పుడు ఆశ్చర్యపోయాడు. అక్కడ కట్నం అంతే యిస్తారు.

పెళ్ళి తంతు జరుగుతూనే వుంది.

మధ్యలో సత్తెన్న వెళ్ళి సెంట్రీ డ్యూటిలో చేరి గంగన్నను వూళ్ళోకి పంపాడు.

గిరిజనులు మళ్ళీ డ్యాన్సు ప్రారంభించారు.

ఆ పెళ్ళి తంతు చూస్తుంటే సుధాకర్ మనస్సు ఎక్కడెక్కడో విహరిస్తోంది. ఏవో మధురమైన వూహల్లో తేలుతున్న వాడల్లా ఒక్కసారిగా ఎందుకో తుళ్ళిపడ్డాడు.

ఔను! తన చెల్లెలి పెళ్ళి. యిలాగే తాను నిలబడి తాను చేయించాల్సిన పెళ్ళి.

దానికి యింకా పెళ్ళి కాలేదు. దాని తోటివయస్సుది మరదలు లలితకి అప్పుడే యిద్దరు పిల్లలు. కన్నతల్లిని, చెల్లిని వదిలివచ్చాడు తాను. తనవల్ల వాళ్ళు ఎన్ని యిబ్బందులు పడుతున్నారో. ప్రతిరోజు పోలీసులు తనకోసం వాళ్ళని ఎంతగా వేధిస్తున్నారో... వాళ్ళు అక్కడ బతుకు ఎలా వెళ్ళదీస్తున్నారో...

పెళ్ళి బోజనం ముగించి దళం గూడెంతో వీడ్కోలు తీసుకుంది.

పిండార బోసిన వెన్నెల్లో దళం నిశ్శబ్దంగా నడుస్తూంది.

ఏదో జంతువు దళం ముందునుండే రాకెట్‌లా దుసుకుపోయింది.

అడవి మధ్యలోకి చేరుకుంది దళం.

"రాజన్నా! ఇగ యిక్కడ ఆగితే?" భీమన్న.

"ఇంకొంచెం ముందుకు పోదాం!"

దళం కొంచెం ముందుకుపోయి ఆగింది.

రాజన్న గొడ్డలితో చిన్న చిన్న చెట్లు నరుకుతున్నాడు. పడుకునే స్థలం అలా శుభ్రం చేయడం రాజన్నకు అలవాటు. పక్క పరిచారు. ఏ ఏ వేళకు ఎవరెవరు సెంట్రీయో నిర్ణయించుకొని ఒరిగారు. కొద్దిసేపట్లోనే అందరూ నిద్రలోకి జారారు.

వెన్నెల గుంకింది... చీకటి కమ్ముకుంది. చల్లగాలి కమ్మగా వీస్తూంది. సుధాకర్ సెంట్రీ డ్యూటీ చేస్తున్నాడు. దిక్కులు చూస్తు అటు ఇటూ తిరుగుతున్నాడు. అడవి అప్పుడే స్నానం చేసినట్టుగా నిర్మలంగా వుంది. కొత్తాకు వేసిన తునికి చెట్లు పచ్చగా వున్నాయి.

అడవి అప్పుడే కొత్తచీర కట్టున్న పల్లెపడుచులా వుంది. అడవి అప్పుడే విరబూస్తున్న వసంతలా వుంది. వసంతం మౌనంగా ఎదుట నిలబడ్డట్టుగా వుంది. ఆ అడవిలో ఆ చీకటిలో ఆ నిశ్శబ్దంలో శబ్దంలా ఎక్కడో వసపిట్ట ఆదేపనిగా అరుస్తూంది. చల్లగా వీస్తూన్న గాలి కమ్మగా అడవిపూల వాసన మోసుకొస్తున్నది. తప్పిపోయిన పిల్లకోసం కొండగొర్రె అరుపుల్తో అడవి మార్మోగుతోంది. అల్లంత దూరాన ఎండిన ఆకుల్లో గలగలమన్న చప్పుడు.

అది ఉడుతో... అడవి పందో...

ఏదో అడుగుల సవ్వడి ఎండుటాకులమీద పడి పరపరమంటూ నిశ్శబ్దంలో ఆ శబ్దం ఆగిపోయింది.

చెవులు రిక్కించాడు సుధాకర్.

అటుకేసి పరీక్షగా చూశాడు. యేమీ కనిపించలేదు.

మళ్ళీ అడుగులో అడుగేస్తూ నడుస్తున్న సవ్వడి.

ఎందుకో ఒక్కసారిగా సుధాకర్ వెన్నుపూస వణికింది.

ఒళ్ళు గగర్పొడిచింది.

చేతిలో రైఫిల్ వణికింది.

భయంగా... భయం భయంగా, నిశ్శబ్దంగా కదిలాడు సుధాకర్.

"రాజన్న! రాజన్న!"

"ఏంది?" అంటూ లేస్తూనే పక్కనున్న రైఫిల్ తీశాడు రాజన్న.

"ఆగో! గా తునికిచెట్టు కింద ఏదో నడుస్తున్న చప్పుడైంది. సరిగ కనవడ్తలేదు."

రాజన్న నిద్రమత్తు వదిలిపోయింది.

జాగ్రత్తగా అడుగులువేస్తూ అటుకేసి నడిచాడు.

అలికిడి లేదు. మళ్ళి అడుగుతీసి అడుగు వేశాడు.

కొద్ది క్షణాలకి రాజన్న నడుస్తున్న ఎండుటాకుల చప్పుడుకు ఏదో బెదిరి నాలుగు కాళ్ళమీద ఒక్కసారిగా ఎగిరి చీకట్లో కలిసిపోయింది.

అయిదు నిమిషాల తరువాత రాజన్న తిరిగి వచ్చాడు.

"అది మెకం (ఎనుబోతు). మనల జూసి బెదిరినట్టుంది."

సుధాకర్ మౌనం వహించాడు. ఇద్దరి మధ్య నిశ్శబ్దం. లీలగా అడవి జంతువుల చప్పుడు. రాజన్న సుధాకర్‌కేసి చూశాడు.

రాజన్న మొహంలోకి చూడ్డానికి సుధాకర్‌కి సిగ్గనిపించింది. ఎందుకో వెన్నుపూస సన్నగా యింకా వణుతూనే వుంది.

శత్రువులు నిజంగా ఎదురైనప్పుడు కూడా ఎన్నడూ యిలా వెన్నుపూస వణకలేదు. తనలో ప్రాణభయం ప్రవేశించిందా? ప్రాణభయం స్వార్థానికి గుర్తు. తనలో స్వార్థం ప్రవేశించిందా?

ఇదెలా సంభవం? కమాండర్ రాజన్న మరోసారి కలియజూసి వచ్చాడు.

అంతా ప్రశాంతంగానే వుంది.

అడవి నిద్రపోతూ వుంది.

వసపిట్ట అలాగే అరుస్తూ వుంది.

"ఇల్లు యాదికచ్చిందా?" తల్లిలా అడిగాడు కమాండర్ రాజన్న.

సుధాకర్ మాట్లాడలేదు. మనస్సు యింకా ఏదో ఆలోచిస్తూనే వుంది. ఆ గిరిజన పెళ్ళి. ఆ పెళ్ళిలో తనకు కలిగిన ఆలోచనలు. గతం గురించిన ఆలోచన జ్ఞాపకాలు. అవే ఎంతపని చేశాయి!

తల్లిముందు తప్పు ఒప్పుకున్న పసిపిల్లవాడిలా నవ్వాడు సుధాకర్. తనను తాను జయించిన వాడిలా నవ్వాడు సుధాకర్.

"ఇల్లే లోకం అనుకుంటే లోకమంతా మనలను భయపెడ్తది. ప్రపంచమే మన యిల్లనుకుంటే యిగ మనను భయపెట్టుటానికేముంటది? ... ఔ గని నిద్రస్తుందా?"

"పడుకో పో ! నేను సెంట్రీచేస్త." లోకం తెలిసిన రాజన్న లాలనగా అన్నాడు. సుధాకర్ ఇంకా ఏదో ఆలోచిస్తున్నాడు.

ఆ కళ్ళు ఏదో దృశ్యాన్ని కళ్ళముందుకి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తనకి ఈ ప్రపంచమే ఇల్లు.

ఈ ప్రజలే తమ తల్లిదండ్రులూ, అన్నదమ్ములూ. కల్లాకపటం ఎరగనివాళ్ళ మనస్సులో కల్లోలం రేపింది తామే.

వాళ్ళు ఎన్నో తెల్సుకోవడంతో దోపిడిదారులు అల్లకల్లోలమే అయ్యారు

పూనకంలా మీదపడ్డారు. వాడు ఎన్ని హింసలు పెడుతున్నాడు.

ఇంత నిర్బంధంలోనూ నిన్ననేకదా గిరిజన దాదాలు మరింత కసితో కల్లం కాలబెట్టింది!... నిన్నటి వాళ్ళ సంబరంలో తానుకూడా ఎంత ఉత్సాహంగా ఎగిరాడూ.... తమ అండ తమ ధైర్యం చూసుకొనేకదా వాళ్ళు ఇన్ని నిర్బంధాల్ని అధిగమిస్తున్నది! వాళ్ళ ఉనికి, వాళ్ళ స్పర్శ, వాళ్ళ ఆప్యాయత ఎంత గొప్ప స్ఫూర్తి!

ఆకు కల్లం కదులుతున్న దృశ్యం. అందరితో తాను ఎగురుతున్న దృశ్యం.

సుధాకర్ మనస్సుని చిల్లగింజలా కడిగింది.

శత్రువు కల్లంలా స్వార్థం మండిపోయింది.

కొమ్మలు నరికిన తునికిచెట్టు పచ్చపచ్చగా కళకళలాడుతున్నట్టుగా సుధాకర్ కళ్ళు ఏదో వెలుగు నింపుకొని ప్రకాశిస్తున్నాయి.

వెన్ను వణుకు ఆగిపోయింది. ఉత్సాహంగా నవ్వాడు సుధాకర్. "ఉహు! లేదు" అని తల అడ్డంగా వూపాడు. సుధాకర్‌కేసి తృప్తిగా చూసి మళ్ళీ ఒరిగాడు. సెంట్రీ సుధాకర్ నిటారుగా నిలబడ్డాడు. నిలుచునే నిదానంగా పరిశీలిస్తున్నాడు.

అందరూ లేచి సర్దుకున్నారు. వసపిట్ట ఇంకా అరుస్తూనే వుంది.

ఎండుటాకులు బరబర చప్పుడు చేస్తూనేవున్నాయి.

ఎక్కడో మెకం అరుస్తూనే వుంది. ఎక్కడో నెమళ్ళ అరుపు లాలనగా వినిపిస్తూనే వుంది.

దళం నడుస్తూ వుంది. దళం చెమటలు కక్కుతూ వడివడిగా నడుస్తూ గంభీరంగా వుంది. అంతలో ఓ మద్దిచెట్టు కిందకి చేరింది దళం.

రాజన్న ఒక్క క్షణం ఆగాడు, దళం ఆగిపోయింది. రాజన్న అందరివైపు చూశాడు. చూపు గంభీరంగా వుంది. ఆ చూపుల్లో గతకాలపు జ్ఞాపకాల బాధాతీవ్రత వుంది. చెయ్యితో చూపిస్తూ చెప్పాడు రాజన్న.

"ఇక్కన్నే! ఇగో ఈ జాగలనే గంగరాజం బాంబు పేలి చనిపోయింది. ఇగో... తల ఇటుకెయి... కాల్లు అటుకెయి... నెత్తురు ఇదంతా చిమ్మి పడిపోయిందు.

"అమ్మా అని పడిపోయిందు. ఆరోజు ఇదంతా రక్తమే...'

ఆనాడు జరిగిన సంఘటన జ్ఞాపకాలు చెపుతుంటే అందరు అలసట మరిచి పోయారు. మనసంతా ఉద్వేగభరితమైపోయింది.

"ఇక్కన్నుంచి లేపి ఇగో... ఇక్కడికి తీసుకచ్చి కట్టెలు పేర్చి కాల్చేసినం. అంతా కండ్ల ముంగట జరిగిపోయింది. 'నా కండ్లల్ల ఇంకా కదులుతూనే వున్నది... వింతలా జరిగిపోయింది." రాజన్న గంభీరమైపోయాడు. క్షణం ఆగి మళ్ళీ అన్నాడు. "ఇగో ఆ బూడిద యింకా వున్నట్టేవుంది..." అంటూ రాయిపక్కన బూడిద కలిసిన మట్టిని చూపించాడు.

సుధాకర్ ఒళ్ళు ఒక్కసారిగా గగుర్పొడిచింది.

మనస్సులో ఎన్నో ఆలోచనలు. అమరవీరుల పాటలు ఎన్నో పాడాడు. కాని అమరవీరుని వీరమరణం ఇంత దగ్గరగా, ఇంత స్పష్టంగా చూడడం అదే మొదటిసారి.

గంగరాజం (రవి) స్మృతికి కమాండర్ రాజన్న పిడికిలెత్తాడు.

తన కళ్ళల్లో సుళ్ళు తిరిగిన కన్నీళ్ళని ఎవరికి కనిపించకుండా కళ్ళల్లోకే లాక్కున్నాడు కమాండర్ రాజన్న.

గంగారాజం స్మృతికి పిడికిలెత్తి సెల్యూట్‌చేస్తూ దళం ముందుకు కదిలింది.

"తునికిచెట్టు" పేరుతో అరుణతార మాస పత్రిక
- నవంబర్ 1987 - జనవరి 1988